
సాక్షి తిరుపతి

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



టీటీడీకి 18 క్లీనింగ్ యంత్రాలు

ఐడీబీ బ్యాంకు వారు సామాజిక బాధ్యతలో భాగంగా టీటీడీకి 18 క్లీనింగ్ యంత్రాలను విరాళంగా అందించారు. - IIలో



'గుట్ట'కాయ స్వాహా

రామచంద్రాపురం సమీపంలోని సిద్ధేశ్వర గుట్టను కొందరు కూటమి నేతలు అక్రమంగా తవ్వేసి మట్టిని తరలించేస్తున్నారు. - IIలో



త్వరలో మరో 'వందేభారత్'

విజయవాడ నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు వందేభారత్ రైలు నడిపేందుకు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. - IIలో

న్యూస్‌రీల్

23 నుంచి పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పీజీసెట్-2025కు సంబంధించి సోమవారం నుంచి మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులకు ఆయా కళాశాలల్లో సీట్లు కేటాయించనున్నట్లు కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు సీట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించి ప్రతి విద్యార్థికీ వారి ఫోన్ నంబర్లకు మెసేజ్ పంపనున్నట్లు తెలియజేశారు. సీట్లు కేటాయించిన విద్యార్థులు ఆయా వర్సిటీల పరిధిలోని కళాశాలల్లో మంగళవారం రిపోర్టు చేయాల్సి ఉంటుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,042 మంది స్వామివారిని దర్శించుకోగా 23,393 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. సాధారణంగా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నారు. అయితే గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఉంటేనే 100శాతం మంది అధికారులు వస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఉంటే 75శాతం మంది మాత్రమే కనిపిస్తున్నారు. డీఆర్ఓ ఉంటే 50శాతం మందిని మాత్రమే చూడవచ్చు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ ఉంటే కేవలం 25శాతం మంది మాత్రమే అధికారులు గ్రీవెన్స్‌కు హాజరవుతున్నారు. ఈ మేరకు కలెక్టర్, జేసీ ప్రోగ్రామ్‌ను ముందస్తుగానే తెలుసుకుని, వాళ్లు రాకుంటే తమ సబార్డినేట్లను పంపించి చేతులు దులిపేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలలు నుంచి ఈ తంతు కొనసాగుతూనే ఉండడం గమనార్హం.

ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈగా చంద్రశేఖర్‌రావు



తిరుపతి రూరల్: ఏపీ ఎస్పీడీసీఎల్ ఆపరేషన్ విభాగంలో సూపరింటెండెంట్ ఇంజినీరుగా విన్నకోటి చంద్రశేఖర్‌రావుకు అవకాశం దక్కింది. గత నాలుగు రోజుల క్రితం పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సూపరింటెండెంట్ ఇంజినీర్లుగా పదోన్నతలు లభించాయి. అందులో చంద్రశేఖర్‌రావు కూడా ఉన్నారు. తిరుపతి సర్కిల్ ఎస్ఈగా చంద్రశేఖర్‌రావుకు పోస్టింగ్ ఇవ్వడంతో ఆయన ఆదివారం తిరుపతి సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు విద్యుత్తు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

విపత్తు!



నా పేరు రఘురామయ్య. మాది వరదయ్యపాళెం మండలం, కురింజల్లం గ్రామం. నేను గత ఏడాది వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు దుకాణంలో 20 కేజీల ఎంటీయూ 1271 రకం వరి విత్తనాలను ఒక్కో బస్తా రూ.950 చొప్పున 3 బస్తాలు కొనుగోలు చేశాను. అయితే నారుమడి పోసి వారం రోజులైనా విత్తనాలు మొలకెత్తలేదు. కొనుగోలు చేసిన దుకాణదారుడిని జరిగిన ఇబ్బంది గురించి వివరించినా ఏమాత్రం స్పందించలేదు. చేసేదేమీ లేక రెండో పర్యాయం శ్రీకాళహస్తిలో కొనుగోలు చేసి మరోమారు నారుమడిని సిద్ధం చేసుకుని వరినాట్లు వేసుకున్నా. ప్రైవేటు డీలర్లు ఇంత దారుణంగా రైతులను దోపిడీ చేస్తున్నారు. దీనిపై అధికారులు సైతం నామమాత్రంగానే స్పందించారు.

రబీ సీజన్‌కు సంబంధించి రైతులు వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు నారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే నాణ్యమైన విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ మద్దతు లేకపోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు నిలువు దోపిడీకి తెరతీస్తున్నారు. నకిలీ వంగడాలను అధిక ధరలకు అంటగట్టి అన్నదాతను దగా చేస్తున్నారు. మొలకెత్తని విత్తనాలతో గత ఏడాది అనుభవాలను గుర్తుచేసుకుని రైతులు మథన పడుతున్నారు. ఆరుగాల కష్టం.. నష్టాలపాలవుతుందేమో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి సర్కారు ఇప్పటికైనా స్పందించి సహకారం అందించాలని కోరుతున్నారు.

రబీకి సిద్ధమవుతున్న నారు మడులు

- సత్యవేడు సబ్ డివిజన్‌లో నకిలీ వరి వంగడాలు
- రైతులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు
- అధిక ధరలకు విత్తన విక్రయాలు
- ఆందోళనలో అన్నదాతలు

వరదయ్యపాళెం : జిల్లాలోని తూర్పు మండలాలైన వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, సత్యవేడు, కేవీబీపురం, నాగలాపురం ప్రాంతాల్లో వరి పంట ప్రాధాన్యతగా సాగు చేస్తారు. అయితే వ్యాపారులు మాత్రం రైతులను నకిలీ విత్తనాలతో నిలువునా మోసం చేస్తున్నారు. ఈ మేరకు ఏటా నకిలీ విత్తనాల ముప్పు రైతులను వెంటాడుతోంది. గత ఏడాది వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, సత్యవేడు, కేవీబీపురం మండలాల్లో పలుచోట్ల నకిలీ విత్తనాలతో అన్నదాతలు నారుమడుల దశలోనే నష్టపోయారు. అయితే ఈ ఏడాది కూడా ఆ పరిస్థితులు పునరావృతం అవుతాయా? అనే ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలోనే సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా వరి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. ప్రైవేట్ దుకాణాల వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.



గత ఏడాది కురింజల్లంలో మొలకెత్తని వరి నారుమడి (ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేయూత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు చేయూతనందించారు. గ్రామస్థాయిలో ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచేవారు. నకిలీ విత్తనాల నియంత్రణకు నియోజకవర్గానికి ఓ అగ్రి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ ల్యాబ్‌లు వినియోగం నామమాత్రం కావడంతో ప్రైవేటు వ్యాపారుల అక్రమాలకు రెక్కలొచ్చాయి. దీంతో ఇష్టారాజ్యంగా వ్యాపారులు రైతులను దోపిడీ చేసేందుకు సిద్ధమయ్యారు.



నిరుపయోగంగా అగ్రి ల్యాబ్

మొలకెత్తని ఎంటీయూ-1271

గత ఏడాది వరదయ్యపాళెం మండలంలో ఎంటీయూ-1271 రకం వరి విత్తనాలు మొలకెత్తక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రైవేటు దుకాణదారులు నకిలీ విత్తనాలను రైతులకు విక్రయించిన కారణంగా ఈ దుస్థితి దాపురించింది. మండలంలోని కురింజల్లం, సీఎల్ఎన్‌పల్లె, కడూరు, నెల్లటూరు, తాగేలి, అరుదూరు తొండంబట్టు ప్రాంతాల్లో రైతులు నకిలీ విత్తనాల బారిన పడ్డారు. బాధిత రైతులు దీనిపై వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

బిల్లులు ఇవ్వకనే..

దుకాణదారులు రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, పురుగు మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వడం లేదు. షాపుల వద్ద ధరల పట్టికతో బోర్డులు సైతం ఏర్పాటు చేయడంలేదు. ఎంఆర్‌పీ కంటే రూ. 30 నుంచి రూ.50 అధికంగా వసూలు చేస్తున్నారు. అధికారుల హెచ్చరికలను బేఖాతర్ చేస్తున్నారు. ఆ దశగా సత్యవే డు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 30 మందికి పైగా ప్రైవేటు డీలర్లు ఉన్నారు. వీరి ఆగడాలకు అడ్డూ అదుపే లేదు. ఇదే విధంగా పురుగు మందులు, ఎరువుల విషయంలోనూ అత్యధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారులు మాత్రం రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు.



నారు మడుల్లో చల్లేందుకు ఆటోలో విత్తనాలను తరలిస్తున్న రైతులు



గత ఏడాది కురింజల్లంలో మొలకెత్తని నారుమడులను పరిశీలిస్తున్న ఏడీఏ సుబ్రమణ్యం, వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

అందుబాటులోని వరి వంగడాలు

ఎంటీయూ -1224	ఎంటీయూ -1271
బీపీటీ -5204	కేఎన్ఎం -1638
1010 పొన్మణి	బుద్దలు

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలవాలి. రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రయతి్నంచే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా పంటకు అవసరమైన విత్తనాలు పూర్తిస్థాయిలో నాణ్యత కలిగినవి మాత్రమే విక్రయించాలి. కచ్చితంగా ప్రభుత్వం నిర్ధేశించే ధరలకు విక్రయించాలి. **– శివకుమార్, రైతు, కురింజల్లం**

లైసెన్సులు రద్దు చేయాలి



నకిలీ విత్తనాలను విక్రయించే దుకాణాలకు లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలి. రైతులకు నష్టం కలిగించిన దుకాణ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. దీనిపై వ్యవసాయశాఖ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. తక్షణమే విజిలెన్స్ అధికారులు మండలంలోని విత్తన దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలి. నకిలీ విత్తనాల నివారణకు కృషి చేయాలి. **– భాస్కర్ రెడ్డి, రైతు సంఘం నేత, పెద్ద పాండూరు**

పర్యవేక్షిస్తాం



రబీ సీజన్ మొదలైంది. ప్రస్తుతం రైతులందరూ వరి సాగు కోసం నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారుల వద్ద ఉన్న వరి విత్తనాల వివరాలను పరిశీలిస్తాం. గత ఏడాది ఇబ్బందులు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తాం. డీలర్లు తమ వద్దకు వచ్చే ప్రతి లాట్ నుంచి ముందుగానే కొంత శాంపిల్ తీసుకుని టెస్టు చేయించాలి. అందులో 80 శాతం వరకు మొలకెత్తిన తర్వాతే విక్రయించాలి. అదే పద్ధతిలో రైతులు కూడా కొనుగోలు చేసిన విత్తనాలను తొలుత ఇంటి వద్ద పరీక్షించిన తర్వాతే నారుమడుల్లో చల్లుకోవాలి.

– సుబ్రమణ్యం, ఏడీఏ, సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రేపే అంకురార్పణ

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం మంగళవారం రాత్రి 7 నుంచి 8 గంటల నడుమ 'అంకురార్పణ' ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

సేనాధిపతి ఉత్సవం

శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనుల వారికి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించనున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విష్వక్సేనులవారు మాడ వీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం.

బీజవాపనం

వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం అత్యంత ముఖ్యమైనది. ముందుగా పాలికల్లో(మట్టికుండలు) పుట్ట మన్ను నింపుతారు. వీటిలో నవధాన్యాలు పోస్తారు. ఈ విత్తనాలు బాగా మొలకెత్తాలని కోరుతూ ఓషధీసూక్తాలను పఠిస్తారు. పాలికల చుట్టూ 49 మంది దేవతలను ఆవాహన చేస్తారు. పాలికల్లోని నవధాన్యాలను బ్రహ్మోత్సవాల 9 రోజుల పాటు పెంచుతారు. చివరి రోజున ఈ మొలకలను వేరుచేసి స్వామివారికి అక్షతారోపణ చేస్తారు.



నెలసరి పరిశుభ్రతపై అవగాహన

తిరుపతి రూరల్ : తిరుపతిలోని బైరాగిపట్టెడలో ఉన్న బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినులకు ఆదివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద నెలసరి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ కోనప్రభ మాట్లాడుతూ నెలసరి సమయంలో శుభ్రతను పాటించడం ఆరోగ్య పరిరక్షణకు అత్యంత అవసరమని తెలిపారు. లేకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వెల్లడించారు. జంక్ ఫుడ్స్ కి దూరంగా ఉండాలని సూచించారు. హాస్టల్ వార్డెన్ కె. రాధారాణి, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ వి.ప్రీతి పాల్గొన్నారు.

తర్పణం.. కిక్కిరిసిన 'తీర్థం'



కపిలతీర్థం వద్ద జన సందోహం



తర్పణాలు వదులుతున్న జనం

అత్యంత అరుదుగా ఆదివారం మహాలయ అమావాస్య రావడంతో పితృ తర్పణాల సమర్పణకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కపిలతీర్థంలో పిండ ప్రదానం చేసేందుకు భారీగా క్యూ కట్టారు. ఈ మేరకు కపిలేశ్వర బ్రాహ్మణ పురోహిత సేవా సంఘం సభ్యులు శాస్త్రోక్తంగా ప్రక్రియ చేపట్టారు. వేకువజాము నుంచే సుమారు 200 మంది తర్పణ క్రతువుల నిర్వహణకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలోనే పితృ రుణం తీర్చుకునేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు కపిలతీర్థం చేరుకున్నారు. పురోహితులు సైతం రూ.500 నుంచి రూ.5వేల వరకు ఇష్టారాజ్యంగా దక్షిణ వసూలు చేయడంతో పలువురు ఇబ్బందిపడ్డారు. అయితే జనవాహినికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో టీటీడీ అధికారులు విఫలమయ్యారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు చేపట్టారు. **– తిరుపతి కల్చరల్**



క్యూలో వెళుతున్న ప్రజలు



బందోబస్తుపై సూచనలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు



పితృ తర్పణాలు సమర్పిస్తున్న దృశ్యం

జెండాకు జేజేలు!



బొడ్డు చౌక వద్ద జెండాను దర్శించుకునేందుకు వెళుతున్న భక్తులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలో ఆదివారం అంగరంగ వైభవంగా జెండా ఉత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో పురవీధులు జనంతో కిక్కిరిశాయి.

ప్రత్యేక పూజలు

పట్టణంలోని బొడ్డు చౌకలో సాయంత్రం 6 గంటలకు ఆంజనేయస్వామి జెండాను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే తూర్పువీధి, కోనేటిమిట్టతోపాటు పలు ప్రాంతాల్లో జెండా ఊరేగింపులు ప్రారంభించారు. ఒక్కో జెండా ప్రతిష్ఠకు రూ.లక్ష నుంచి రూ.35లక్షల వరకు వెచ్చించడం విశేషం.

అలరించిన భేతాళ నృత్యం

జెండా ఊరేగింపు సందర్భంగా కేరళ బృందాలతో వాయిద్యాలను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులను అలరించేలా భేతాళ నృత్యాలను చేపట్టారు. ఈ క్రమంలోనే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో పకడ్బందీగా పోలీసులు బందోబస్తు చేపట్టారు.



జెండా ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు



కోనేటిమిట్టలో జెండా ఊరేగింపు

క్లుప్తంగా

ముగిసిన ఆర్ట్ వర్క్ షాప్



చిత్రాలను తిలకిస్తున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

ఏర్పేడు: ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆర్ట్ వర్క్ షాప్ ఆదివారం ముగిసింది. ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొని ఆర్ట్ చిత్రాల ఎగ్జిబిషన్ తిలకించారు. ఐఐటీ, ఐసర్ విద్యా సంస్థలకు చెందిన ఔత్సాహిక విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీటీడీకి 18 క్లీనింగ్ యంత్రాలు విరాళం



దాతలు అందించిన క్లీనింగ్ యంత్రం

తిరుమల: కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్)లో భాగంగా ఐడీబీ బ్యాంక్ టీటీడీ ఆరోగ్య విభాగానికి రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ మిషన్లను ఆదివారం విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ బ్యాంకు ఎండీ-సీఈఓ రాకేష్‌శర్మ శ్రీవారి ఆలయం ముందు పేష్కార్ రామకృష్ణకు యంత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆరోగ్యాధికారి మధుసూదన్, ఐడీబీఐ బ్యాంక్ రీజనల్ హెడ్ సాయికృష్ణ, తిరుపతి బ్రాంచ్ హెడ్ పల్లి రమేష్, బ్రాంచ్ మేనేజర్ దూడల రాజేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



రేణిగుంట : మండలంలోని గుత్తివారి పల్లె సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ నాగరాజు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ఎత్తు సుమారు 5.8 అడుగులు ఉంటుందని, ఒంటిపై ముదురు నీలం రంగు ఫుల్ నెక్ బనియన్, బ్లూజీన్స్ ప్యాంట్ ఉందని వెల్లడించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అధికంగా మద్యం తాగి డీహైడ్రేషన్ కారణంగా లేదా అనారోగ్యంతోనే మరణించి ఉండవచ్చని వివరించారు. వెదుళ్లచెరువు వీఆర్ఓ మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

మీడియా స్వేచ్ఛను హరించడం తగదు



ప్రశ్నించే హక్కు, సమాజంలో జరిగే తప్పొప్పులను వెలికి తీసే హక్కు మీడియాకు ఉంటుంది. వారి హక్కులను, స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం సబబు కాదు. ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తున్న సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు పెట్టడం అన్యాయం. పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తే కేసులు పెట్టడం కొత్త సంస్కృతి అనిపిస్తోంది. ప్రశ్నించే గొంతుల్ని అణగదొక్కాలనుకోవడం బాధాకరం.

– చంద్రారెడ్డి, విశ్రాంత తహసీల్దార్



ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పాలకులు చేసే తప్పులు, పొరపాట్లను ప్రజలకు చేరవేయడంలో పత్రికలది ప్రధానపాత్ర. ప్రజాస్వామ్య పరిరక్షణలో అవి కీలకపాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ అవినీతిని, పాలకుల వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజలకు వాస్తవాలను చేరవేస్తోందనే అక్కసుతో సాక్షిదినపత్రికపై కక్ష సాధింపులకు పాల్పడడం సరైన విధానం కాదు. సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి. కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే.

– సోమిరెడ్డి, విశ్రాంత వీఆర్వో అసోసియేషన్ నాయకులు

గుట్టకాయ స్వాహా!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రకృతి వనరులకు రక్షణ లేకుండా పోతోంది. రూ.కోట్ల సంపాదనే లక్ష్యంగా పచ్చమూక రెచ్చిపోతోంది. ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతోంది. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతోంది. ఈ క్రమంలోనే సిద్ధేశ్వరగుట్టపై అక్రమార్కుల కన్నుపడింది. అనుకున్నదే తడవుగా భారీ యంత్రాలతో తవ్వేసి ఎర్రమట్టిని తరలించేస్తున్నారు. గుట్టను చదును చేసి ప్లాట్లు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం నకిలీ పట్టాలు సృష్టించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

- కూటమి నేతల గుప్పిట్లో సిద్ధేశ్వర గుట్ట
- భారీ యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు
- చదును చేసి ప్లాట్లు వేసేందుకు సన్నాహాలు
- ఆక్రమణలపై చేతులెత్తేసిన రెవెన్యూ అధికారులు



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు చెందిన జేఎంసీ కంపెనీ టిప్పర్‌లో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

అక్రమార్కులకు ప్రజాప్రతినిధుల అండ..!

సిద్ధేశ్వరకొండను దోచేస్తున్న వారి వెనుక తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధుల సహకారం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు చెందిన జేఎంసీ కంపెనీకు చెందిన టిప్పర్లలోనే ఎర్రమట్టిని తరలుతున్న క్రమంలో ఆరోపణలకు బలం చేకూరుతోంది. తిరుపతికి అత్యంత సమీపంలో గ్రావెల్ లభ్యమయ్యేది ఒక్క రామచంద్రాపురం మండలంలో మాత్రమే కావడంతో ఇద్దరు ప్రజాప్రతినిధులు తమ అనుచరులతో కొండను కొల్లగొడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రామచంద్రాపురం సమీపంలోని సి.రామాపురానికి ఆనుకుని సిద్ధేశ్వరగుట్ట ఉంది. రహదారి పక్కనే ఈ గుట్ట ఉండడంతో పచ్చనేతల కన్ను పడింది. గుట్టను స్వాహా చేసేందుకు కుట్రలకు తెరతీశారు. చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి సహకారం ఉండటంతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో వారం రోజులుగా హిటాచీ, జేసీబీలు, టిప్పర్లతో కొండను తవ్వేస్తున్నారు.

రూ.కోట్ల విలువైన గ్రావెల్ తరలింపు

సి.రామాపురం లెక్క దాఖల సర్వే నంబరు 28లో సిద్ధేశ్వర గుట్టపై నాణ్యమైన ఎర్రమట్టి ఉంది. ఎర్ర బంగారంగా పిలిచే ఈ మట్టిని భారీ యంత్రాల ద్వారా తరలించేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రింబవళ్లు గ్రావెల్ లోడ్‌తో వాహనాలు వేగంగా వెళుతున్నాయని, ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అధికార పార్టీ నాయకులకు ఎదురు చెప్పలేకపోతున్నామని వాపోతున్నారు. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న గుట్టపై జరుగుతున్న అక్రమాలను పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రతిరోజూ చూస్తున్నారే కానీ, ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. సుమారు వారం రోజులుగా జరుగుతున్న ఈ దందాలో ఇప్పటికే రూ.కోట్లు చేతులుమారినట్లు ఆరోపిస్తున్నారు. కొండ నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టిని తిరుపతి నగరంలోని లేఅవుట్లు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలకు వినియోగిస్తున్నారని వెల్లడిస్తున్నారు.

అధికారుల మౌనం

జాతీయ రహదారికి ఆనుకుని, పట్టపగలే ప్రకృతి వనరులను దోచేస్తున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు మౌనంగా చూస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా కొండలు, గుట్టలను కొల్లగొట్టడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదముందని మేధావులు చెబుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఆర్డీఓ స్పందించి గుట్టను కాపాడాలని కోరుతున్నారు.

పక్కా ప్లాన్‌తోనే చదును

సిద్ధేశ్వరగుట్టలోని గ్రావెల్‌ను తరలిస్తూనే మరో వైపు గుట్టను చదును చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఓ వైపు గుట్టలోని మట్టిని స్వాహా చేస్తూనే, మరో వైపు చదును చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మట్టి తరలించేసిన తర్వాత నకిలీ పత్రాలను సృష్టించి, వాటిని ప్లాట్ల కింద విక్రయించేందుకు పన్నాగం పన్నుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టాలను తయారు చేసేందుకు మండలంలోని ఓ పచ్చనేత పథకం రచించినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే రూ.కోట్ల విలువైన గ్రావెల్‌ను తరలించడంతో పాటు ప్లాట్లుగా విక్రయించి సొమ్ము చేసుకోవడానికి పచ్చనేతలు సిద్ధమైనట్లుగా తెలుస్తోంది.



టిప్పర్‌కు గ్రావెల్ లోడ్ చేస్తునన హిటాచీ



భారీ యంత్రాలతో బండరాళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

అమావాస్య గ్రామోత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో అమావాస్య సందర్భంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను అలంకార మండపంలో ప్రత్యేకంగా అలంకరించి, పంచ హారతులు సమర్పించారు. అనంతరం మేళ తాళాలు, వేదమంత్రాల మధ్య స్వామి, అమ్మవారు పురవీధుల్లో ఊరేగారు.

త్వరలో మరో 'వందేభారత్'

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి మీదుగా మరో వందేభారత్ రైలు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు రైల్వేశాఖ తాజాగా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. విజయవాడ-బెంగళూరు మధ్య నడిచే ఈ సర్వీసు తిరుపతి మీదుగా రాకపోకలు సాగించేలా రూట్ ఖరారు చేశారు తొమ్మిది గంటల్లోనే విజయవాడ నుంచి బెంగళూరుకు, కేవలం నాలుగున్నర గంటల వ్యవధిలోనే తిరుపతి చేరుకునేలా షెడ్యూల్ ఫిక్స్ చేసారు. దీపావళి రోజున ఈ రైలు ప్రారంభించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ రైలులో మొత్తం 8 బోగీలు ఉంటాయి. 7 ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ఉంటుంది. ఈ ట్రైన్ మంగళవారం మినహా వారానికి 6 రోజుల పాటు నడవనుంది. విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి తెనాలి 5.39, ఒంగోలు 6.28, నెల్లూరు 7.43, తిరుపతి 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరుకి 14.15 గంటలకు చేరుతుంది. అదే విధంగా తిరుగు ప్రయాణంలో అదే రోజు ఈ ట్రైన్ బెంగళూరులో మధ్యాహ్నం 14.45 గంటలకు మొదలై, కృష్ణరాజపురం 14.58, కాట్పాడి 17.23, చిత్తూరు 17.49, తిరుపతి 18.55, నెల్లూరు 20.18, ఒంగోలు 21.29, తెనాలి 22.42, విజయవాడకు 23.45 గంటలకు చేరుకుంటుంది.

అవమానించారని..



ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన దిల్‌షాద్‌బేగం | ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు

తిరుపతి రూరల్: అసత్యపు ప్రచారం చేసి, అవమానిస్తున్నారన్న మనోవేదనతో ఓ మహిళ తన ఇద్దరు బిడ్డలతో సహా విషం తాగిన ఘటన ఆదివారం రాత్రి జగనన్న కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని నివాసముంటున్న గాయత్రి, దిల్‌షాద్‌బేగంకు చిన్నపాటి తగాదాలు ఉన్నాయి. ఇటీవల దిల్‌షాద్‌బేగం జిల్లా ఎస్పీని కలసి అర్జీ ఇచ్చారు. దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. గాయత్రి దిల్‌షాద్‌బేగంపై తప్పుడు ప్రచారం చేయడంతో ఆమె తీవ్ర మనోవేదనకు లోనయ్యారు. కుమారుడు సంతోష్ (10), కుమార్తె తేజకుమారి(11)కు విషం తాపించి ఆ తరువాత ఆమె కూడా తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

బధిరులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న డిజేబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్

తిరుపతి అర్బన్: బధిరులకు అండగా ఉంటామని డిజేబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ బధిరులకు ఉన్నత చదువుల కోసం రూ.8.4 లక్షలతో 23 ల్యాప్‌టాప్‌లు, రూ.3.6 లక్షలతో 24 టచ్‌ఫోన్లు, రూ.36 వేల విలువ చేసే పది చెవిటి మిషన్ లు ఇదివరకు ప్రభుత్వం ద్వారా ఇప్పిచ్చామన్నారు. యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ ద్వారా బధిరులకు వారి క్వాలిఫికేషన్ బట్టి ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహించి ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి.గురుస్వామి శెట్టి, రిటైర్డ్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్. రమణప్ప, ఆదినారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటశివారెడ్డి, సంఘ నాయకులు కళ్యాణ చక్రవర్తి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

కపిలతీర్థం వద్ద పోలీస్ బందోబస్తు

తిరుపతి క్రైం: కపిలతీర్థం ఆలయంలో తర్పణాలు వదిలే భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ముందు జాగ్రత్తగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు కపిల్ తీర్థం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని సీఐ రామకిషోర్‌ని ఆదేశించారు. తప్పుడు సమాచారం సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు

కపిల్ తీర్థం వద్ద పోలీసుల వైఫల్యం అంటూ దుష్ప్రచారం చేసి తొక్కిసలాట జరిగిందని చెప్పిన ఓంకార్ అనే వ్యక్తిపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ రామకిషోర్ తెలిపారు. తప్పుడు వార్తలు, ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో ఇతను ప్రసారం చేసినట్లు గుర్తించామన్నారు.

కాంతులీనుతున్న కనకాచలం





దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తిలోని కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయం విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవ విగ్రహాన్ని పిట్లవారివీధి కృష్ణారెడ్డి మండపం వద్ద ఏర్పాటు చేయనున్నారు. దుర్గమ్మ కొండమీదికి వెళ్లలేని వాళ్లు కిందే అమ్మవారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. పిట్లవారివీధి వద్ద ఉన్న ఆర్చి దగ్గర నుంచి కనకాచలం పైన ఉన్న అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో చూడముచ్చటగా తీర్చిదిద్దారు.

– శ్రీకాళహస్తి

టీటీడీకి విరాళంగా స్వీపర్ మెషీన్లు



మెషీన్లకు పూజలు చేస్తున్న అదనపు ఈఓ

తిరుమల: మల్టీ పర్పస్ క్లీనింగ్‌కు ఉపయోగించే రూ.20 లక్షల విలువైన రైడ్ ఆన్ స్వీపర్ మెషీన్లను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు టీటీడీకి ఆదివారం విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ఎదుట టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి బ్యాంకు తిరుపతి జీఎం పత్రి శ్రీనివాస్ అందజేశారు. డిప్యూటీ ఈఓ సోమన్నారాయణ, ఆరోగ్యాధికారి డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

గల్లంతైన రైతు మృతదేహం లభ్యం

పెళ్లకూరు : స్వర్ణముఖినదిలో గల్లంతైన రైతు చమర్తి పాపాయ్య(65) మృతదేహం ఆదివారం దిరసనమాల సమీపంలో లభ్యమైంది. పాపయ్య శనివారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు నదిని దాటుతుండగా ప్రవాహంలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి స్థానికులు రోజంతా గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. అయినా ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో దిరసనమాల వద్ద నదీతీరంలో ముళ్ల చెట్టుకు చిక్కుకొని ఉన్న మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వెంకటగిరి రూరల్ : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఆదివారం ఈ మేరకు సీఐ ఏవీ రమణ వివరాలు వెల్లడించారు. కేరళకు చెందిన ఆర్.జినోజ్ అనే వ్యక్తి గంజాయితో విజయవాడ నుంచి రైలులో తిరుపతి బయలుదేరాడు. శనివారం ఉదయం వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో దిగేశాడు. గంజాయిని సేవించి ఆ మత్తులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

రిసోర్స్‌పర్సన్లకు ముగిసిన శిక్షణ



సాగు పద్ధతులను పరిశీలిస్తున్న రిసోర్స్‌పర్సన్లు

తిరుపతి రూరల్ : రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో 25 మంది బాహ్య కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు మూడు రోజుల పాటు తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఎస్ఆర్‌ఓలు కృష్ణారావు, హుమయూన్, దాదాపీర్, రీజినల్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎ.షణ్ముగం మాట్లాడుతూ సహజ వ్యవసాయ పద్ధతులు, కషాయాలు తయారీని సమగ్రంగా వివరించారు. మొదటి రోజు శిక్షణలో పాల్గొన్న వారికి రైతు సాధికార సంస్థ సూత్రాల వివరణ, మూల్యాంకన పరీక్షలు నిర్వహించారు. రెండో రోజు ఐసీటీ వినియోగం, ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రక్రియలు, ఆరోగ్య, పోషకాహార విభాగం నుంచి ప్రత్యేక శిక్షణ అందించారు. మూడో రోజు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా నారావారిపల్లెలో పీఎండీఎస్, ఏటీఎం, సూర్యమండల మోడల్స్‌ను చూపించారు. అనంతరం రంగంపేటలో డ్రై ప్యాడీ ఇంటర్వెన్షన్లను పరిశీలించారు. తిరుపతి రూరల్ మండలం వేమూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కషాయం తయారీ పద్ధతి, అలాగే సహజ వ్యవసాయ 9 సూత్రాలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు.

విజయవంతంగా 'నవయుగ రన్'



త్రీ కే రన్‌ను ప్రారంభిస్తున్నఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం తిరుపతిలో నవయుగ రన్ చేపట్టారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ నుంచి బాలాజీ కాలనీ మీదుగా ఇందిరా మైదానం వరకు త్రీకే రన్ కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశ భవితకు కట్టుబడి యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత జీవనశైలిని ఎంచుకోవాలని కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైన డ్రగ్స్ విక్రయం, వినియోగం గురించి తెలిస్తే వెంటనే ఈగల్ సెల్ నంబర్ 1908కు కాల్ చేయాలన్నారు. నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

● ఎన్నాళ్లీ కష్టాలు!



తిరుపతి జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాలకు శ్మశాన వాటికలు లేవు. ఉన్న వాటికి సరైన దారి సౌకర్యం లేదు. చాలా శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురైనా ఏ ఒక్కరూ కన్నెత్తి చూడడం లేదు. మృతదేహాలను తీసుకెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ఇలాంటిదే సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురం మేజర్ పంచాయతీలో ఆదివారం చోటుచేసుకుంది. నాగలాపురంలోని వీకేఎం వీధికి చెందిన దేశమ్మ మృతి చెందింది. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లడానికి దారి సౌకర్యం లేక నానా తిప్పలు పడాల్సి వచ్చింది. ఊరులో నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని దొమ్మర కాలనీ వరకు వాహనంపై తీసుకెళ్లి, అక్కడి నుంచి పొలం గట్టుపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఇక్కడ శ్మశాన స్థలం కొంతమేర ఆక్రమణకు గురైంది. దానికితోడు శ్మశాన దారి ప్రారంభంలో దొమ్మర కాలనీ పంచాయతీకి తాగునీటి బోరు వేసి నీరు అందిస్తున్నారు. ఈ బోరు అడ్డంగా ఉండడంతో శ్మశానానికి రోడ్డు నిర్మాణం చేపట్టలేని పరిస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకుని ఈ బోరును మరో చోటుకు మార్చి, శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– నాగలాపురం